# సింగరేణి కార్మికులను ఓటు అడిగే హక్కు టీబీజీకేఎస్‌కే ఉంది

● హక్కులు సాధించాం.. ఆదరించండి.. ● టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి




ఎస్ఆర్పీ 3గనిపై మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 8: టీబీజీకేఎస్ సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించిందని, ఒక్క ఆందోళన లేకుండా 60కి పైగా హక్కులు తీసుకువచ్చిన టీబీజీకేఎస్ యూనియన్‌కు మాత్రమే కార్మికులను ఓటు అడిగే హక్కు ఉందని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-3గనిలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణిలో కారుణ్య నియామకాలు, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 19 వేల పైచిలుకు మందికి ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. 190 మస్టర్లు నిండిన బదిలీ వర్కర్లను సంవత్సరంలోపే పర్మినెంట్ చేపించిన చరిత్ర టీబీజీకేఎస్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే 49శాతం సింగరేణి వాటాను కేంద్రానికి అప్పజెప్పారని, దీనికి అప్పటి గుర్తింపు సంఘాలు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ యూనియన్లు మద్దతు తెలిపాయని ఆరోపించారు. ఈ సంఘాలకు సింగరేణి కార్మికుల ఓట్లు అడిగే హక్కులేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికులకు తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, పర్సెంట్ విద్యుత్ చార్జీల రద్దు, కార్మికులకు ఏసీ సౌకర్యం, క్యాడర్ స్కీం సమస్య పరిష్కారం, పారదర్శకంగా సర్వేస్ జనరల్ మజ్దూర్లకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. సింగరేణిలో మహిళలకు సైతం ఉద్యోగావకాశం కల్పించి చరిత్ర సృష్టించామని తెలిపారు. అనేక హక్కులు కల్పించిన టీబీజీకేఎస్‌కు కార్మికులు అండగా ఉండి, మరోసారి గెలిపించాలని కోరారు. టీబీజీకేఎస్‌లో ముఖ్యనేతలు యూనియన్ మారుతున్నారని చేస్తున్న అసత్య ప్రచారాన్ని కార్మికులు నమ్మవద్దని కోరారు. ఈ సమావేశంలో కేంద్ర ఉపాధ్యక్షుడు ఢీకొండ అన్నయ్య, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు వెంగల కుమారస్వామి, పెట్టం లక్ష్మణ్, కాశీరావు, బ్రాంచ్ కార్యదర్శులు పానుగంటి సత్తయ్య, కానుగంటి చంద్రయ్య, నాయకులు అన్వేష్‌రెడ్డి, చేరాలు, రిక్కుల గోపాల్‌రెడ్డి, సాదుల భాస్కర్, గోపీనాయక్, ఉత్తేజ్‌రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలి

● సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ



ఎస్టీపీపీలో టర్బైన్ మరమ్మతులు పరిశీలిస్తున్న ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్, డిసెంబర్ 8: జైపూర్ సింగరేణి విద్యుత్ కేంద్రంలోని నిర్వహిస్తున్న మొదటి యూనిట్‌కు సంబంధించి మరమ్మతు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ అధికారులకు సూచించారు. శుక్రవారం విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన మొదటి యూనిట్‌కు సంబంధించి మరమ్మతు జరుగుతున్న టర్బైన్‌ను పరిశీలించారు. మరమ్మతుకు సంబంధించి అన్ని పరికరాలను సకాలంలో తెప్పించుకుని పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పదిహేను రోజులకు పైగా మొదటి యూనిట్ విద్యుత్ ఉత్పత్తి నిలిచి పోయిన సంగతి విదితమే. అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతు పనులను పరిశీలించి పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి ఉత్పత్తికి సంబంధించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జీఎం ఈఅండ్ఎం బస్విరెడ్డి, చీఫ్ఓ అండ్ఎం జైన్‌సింగ్, ఏజీఎం శ్రీనివాసులు, ఎస్ఓటూ డైరెక్టర్ కేవీ రావు, డీజీఎం ఆపరేషన్స్ వేణుగోపాల్, ఎస్ఓటూ సీటీసీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ వాడీ కేంద్రంలో వైద్య శిబిరం



పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు రాము, రజిత

గర్మిళ్ల, డిసెంబర్ 8: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ-3 అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాము, డాక్టర్ రజిత అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఎనిమియా, పుట్టుకతో వచ్చే వ్యాధులు, చలికాలంలో ఎదురయ్యే చర్మ సంబంధిత ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ రాము మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పిల్లలలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే వైద్య పరీక్షలు చేయించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆర్బీఎస్కే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాసిపేట, డిసెంబర్ 8 :మండలంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. కొండాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కరపత్రాల విడుదల

కాసిపేట, డిసెంబర్ 8: మండలంలోని రొట్టెపల్లి గ్రామపంచాయతీ చిత్రంగూడ గ్రామంలో శుక్రవారం ఈ నెల 13న నిర్వహించే కుమ్రంభీం విగ్రహ విష్కరణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంద్రం కవిత, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, విద్యార్థి సంఘం అధ్యక్షుడు వెడ్మ కిషన్, సిడాం గణపతి, కుర్సెంగ తిరుపతి, పెంద్రం ప్రభాకర్, రాయి సిడాం రమేశ్, మధుకర్, చిత్రం రాందాసు, పెంద్రం జగన్, కొడప అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమ పూజలు చేస్తున్న దంపతులు

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 8: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సింగాపూర్ పునరావాసకాలనీలో శ్రీలక్ష్మి, భూలక్ష్మి సమేత బొడ్డురాయి సహిత పోచమ్మతల్లి పంచకుండా లాత్మక యంత్రమూర్తి స్థిర స్థాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో శ్రీలక్ష్మి, భూలక్ష్మి, బొడ్డురాయి, పోచమ్మతల్లి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అర్చకులు బుడి అరుణ్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఆలయం వద్ద పలువురు దంపతులతో హోమంతో పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సాయంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత శస్త్ర చికిత్స సేవలను సద్వినియోగం చేసుకోండి




పరీక్షలు నిర్వహిస్తున్న బసవతారకం దవాఖాన వైద్యులు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 8 : గ్రహణ మొర్రి బాధితులకు హైదరాబాద్‌లోని బసవతారకం దవాఖానలో అందించే ఉచిత శస్త్ర చికిత్స సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్ యాదయ్య సూచించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో సమగ్ర శిక్ష సౌజన్యంతో బసవతారకం దవాఖాన డాక్టర్ ముకుంద రెడ్డి, జోషి ఆధ్వర్యంలో జరిగిన గ్రహణ మొర్రి బాధితుల నిర్ధారణ శిబిరాన్ని డీఈవో ప్రారంభించారు. మొత్తం 24 మంది హాజరుకాగా 11 మందికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వీరికి జనవరిలో బసవతారకం దవాఖానలో ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు దరి, సత్యనారాయణమూర్తి, సైన్స్ అధికారి మధుబాబు, జిల్లాలోని ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు

## ఓపెన్ ప్రవేశాలకు 11లోగా దరఖాస్తు చేసుకోండి

దండేపల్లి, డిసెంబర్ 8 : 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ పదవ, ఇంటర్‌లో ప్రత్యేక ప్రవేశాలకు ఈ నెల 11చివరి తేదీ అని దండేపల్లి ఉన్నత పాఠశాల సమన్వయకర్త బీసగొని శంకర్‌గౌడ్, సహాయ సమన్వయకర్త సంఘర్ష్ రాజేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే చివరి అవకాశం అని, ప్రవేశం పొందే అభ్యాసకులు నిజ ధ్రువీకరణ పత్రాలతో మీ సేవా, టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో ఫీజు చెల్లించి రసీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 8309769067లో సంప్రదించాలన్నారు.

## ప్రజలకు కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు

హాజీపూర్, డిసెంబర్ 8 : మంచిర్యాల ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేంసాగర్ రావును గెలిపించినందుకు కాంగ్రెస్ మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. హాజీపూర్ మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ పూస్కూరి శిల్ప-శ్రీనివాస్‌రావు నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ మండల నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు తోట రవి, మాజీ రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ పూస్కూరి శ్రీనివాస్ రావు, వేంపల్లి ఎంపీటీసీ డేగ బాపు, నాయకులు పొట్యాల శ్రీశైలం గౌడ్, రాసమల్ల శ్రీనివాస్ గౌడ్, ఒడ్డె శ్రీనివాస్, సాంబారి కుటుంబ రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 8: మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 9న శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రేగుంట స్వామి తెలిపారు. ఏసీసీ, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



కల్లాల్లో ధాన్యం కుప్పలు

నెన్నెల, డిసెంబర్ 8 : వరి కోతలు కావస్తున్న మండలంలో ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు లేక తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. కల్లాల మీదనే ధాన్యం కుప్పలు నిల్వ ఉండడంతో అకాల వర్షాలకు తడిసిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొడ్డురకాలను ఎవరూ కొనడంలేదని రెండు మూడు వారాలుగా పొలంలోనే కుప్పలు పోసి ఉంచినట్లు తెలిపారు. కొందరు వ్యాపారులు సన్న రకాలను మాత్రమే తీసుకుంటున్నారు. గతేడాది మండలంలో పది కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇప్పుడు ఒక్క సెంటర్‌కూడా నడవడంలేదని అంటున్నారు. ఐకేపీ, డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంది. డీసీఎంఎస్‌లు అంతంతమాత్రమే తీసుకుంటున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకొని మండలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

## మిల్లులకు తరలుతున్న ధాన్యం



కిష్టంపేటలో మిల్లుకు తరలిస్తున్న ధాన్యం

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 8: చెన్నూర్ మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని అధికారులు వేగవంతంగా మిల్లులకు తరలిస్తున్నారు. మూడు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు ఆందోళన గురవుతున్నారు. వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ధాన్యాన్ని సెంటర్ నిర్వాహకులు పలు మిల్లులకు తరలిస్తున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మందమర్రి, డిసెంబర్ 8: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊరు మందమర్రి హనుమాన్ ఆలయం సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైందని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు 25-30 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే తెలియజేయాలని కోరారు.